## క్లుప్తంగా

### 9న కందుల వేలం పాట

**డిండి :** గతేడాది వానాకాలం సీజన్‌లో మండల కేంద్రం, చెర్కుపల్లి ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రాల్లో పండించిన కందుల(పీఆర్‌జీ-176)కు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశానుసారం ఈనెల 9న స్థానిక విత్తనోత్పత్తి కేంద్రం కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏఓ రామలింగేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిండిలో 55.38 క్వింటాళ్లు, చెర్కుపల్లి విత్తనోత్పత్తి కేంద్రంలో 12 క్వింటాళ్ల కందులు అందుబాటులో ఉన్నాయని, వేలం పాటలో పాల్గొనే ఆసక్తి గల రైతులు ముందుగానే రూ. 10వేలు డిపాజిట్ చేయాలని ఏఓ పేర్కొన్నారు. డిపాజిట్ చేసిన డబ్బులు వేలం పాట అనంతరం తిరిగి సంబంధిత రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేములపల్లి(మాడుగులపల్లి) :** సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం మండలంలోని 33కేవీ సీత్యాతండా, 33కేవీ లక్ష్మీదేవిగూడెం ఫీడర్ల పరిధిలోని సీత్యాతండా, తడకమళ్ల, మొల్కపట్నం, పాములపాడు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు శనివారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడంతో పాటు రోడ్లకు మర్మతులు చేపట్టాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ చెనగోని శివడౌగ్, మాజీ వార్డు సభ్యుడు పెద్దిశెట్టి సత్యం శనివారం ఎంపీడీఓ బాలరాజురెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రోడ్లు కుంటలను తలపిస్తున్నాయని, వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

**పెద్దఅడిశర్లపల్లి :** గుడిపల్లి మండలంలోని ఘణపురం గ్రామానికి చెందిన వర్కాల లక్ష్మమ్మ మృతదేహానికి శనివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వరి పొలాల పరిశీలన



వరిచేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**చింతపల్లి :** మండలం కేంద్రానికి చెందిన రైతులు కొడారి వెంకటయ్య, కేతావత్ సోమ్లా నాయక్ వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. నాటిన 45 రోజులకే పొట్టకు రావడంతో రైతులు వ్యవసాయ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కృషి విజ్ఞాన కంపసాగర్ శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జి.శివ ప్రసాద్ వారి పొలాలను పరిశీలించారు. పరిశోధన నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ.నర్సింహ, ఎస్.మధు ఓ.మౌనిక, కార్తీక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ఐకేపీ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలి

**అడవిదేవులపల్లి :** 2024 వానాకాలంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు స్థలాన్ని పరిశీలించాలని మండల స్థాయి అధికారులను ఎంపీడీఓ మోహసిన్ బిన్ అహ్మద్ కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధకారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి వరి సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ఏర్పాటుకు ముందుగా అనువైన స్థలాన్ని పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారిని జి. సరిత, ఏపీఎం శేషయ్యలతో పాటు పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిరుజల్లులకే..చిత్తడి

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వాహణ అస్తవ్యస్తంగా తయారైంది.. ప్రత్యేక అధికారులు కేవలం పేరుకే పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.. మురుగుకాలువల నిర్వాహణ సరే సరి.. వీధి దీపాల నిర్వహణపై పట్టింపు లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే అంతర్గత రహదారులు కుంటలను తలపిస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మేజర్ గ్రామపంచాయతీ కొండమల్లేపల్లిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- కొండమల్లేపల్లి



కొండమల్లేపల్లిలో చిన్నపాటి వర్షానికే కుంటను తలపిస్తున్న దృశ్యం





కొండమల్లేపల్లిలో రోడ్లపైనే పేరుకుపోయిన చెత్తాచెదారం



బీసీ కాలనీలో పరిస్థితి ఇలా..

## నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

- డీపీఎల్‌ఓ రాఘవరావు

**త్రిపురారం:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసే నిధులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీపీఎల్‌ఓ రాఘవ రావు హెచ్చరించారు. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీకి 15వ ఫైనాన్స్ నుంచి విడుదలైన నిధులను గ్రామ కార్యదర్శి దుర్వినియోగం చేసి పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన సమాచార హక్కు చట్టం సమితి సభ్యుడు ఇరిగి క్రాంతి కుమార్ గ్రామస్తులతో కలిసి సెప్టెంబర్ 23న ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశానుసారం శనివారం డీపీఎల్‌ఓ పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీలో గ్రామస్తులు, అధికారుల సమక్షంలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేశారు. గ్రామస్తులు, అధికారులను వివరాలు అడిగి తెలుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఎల్‌ఓ మాట్లాడుతూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపామని, పూర్తి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ సమయంలో గ్రామ ప్రత్యేక అధికారి అందుబాటులో లేనట్లు తెలిసింది. కార్యక్రమంలో టైపిస్ట్ గులాం అలీ, పంచాయతీ కార్యదర్శి జాఫర్, రాకూర్ రమేష్ సింగ్, అంబటి వేణు, సింగం సతీష్, యానక బాలకృష్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దదేవులపల్లి గ్రామస్తులను విచారిస్తున్న డీపీఎల్‌ఓ రాఘవరావు

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

**డిండి :** వానాకాలం సీజన్‌లో పండించిన వరి పంట ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని బొల్లనపల్లి గ్రామ శివారులోని పొలాల్లో సాగుచేసిన వరి, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. సన్నరకం వడ్లకు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందుకుగాను త్వరలోనే మండలంలో అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం మండల కేంద్రం, చెర్కుపల్లిలోని విత్తనోత్పత్తి కేంద్రాలను కూడా పరిశీలించి యాసింగ్ సీజన్‌లో విత్తనోత్పత్తికి అనువైన పంటలను సాగుచేసి విత్తనాలను తయారు చేయాలని సంబంధిత వ్యవసాయాధికారులకు ఆయన సూచించారు. ఆయన వెంట ఏడీఏ నివేదిత, ఏఓలు మాధవిలత, వెంకన్న, రామలింగేశ్వరరావు, ఏఈఓలు పరమేశ్వరి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబ వివరాలు సేకరిస్తున్నాం

**త్రిపురారం :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబంలో వివరాలను సేకరిస్తున్నామని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీల అన్నారు. మండలంలోని కొణతాలపల్లిలో మూడో రోజు డిజిటల్ కార్డు సర్వే అధికారులు రెండు బృందాలుగా ఏర్పాడి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కుటుంబ సభ్యుల సూచనల మేరకు తొలగింపు, నూతన కార్డు కోసం చేర్చడం వంటివి పరిశీలించి నిర్ధారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుబాటులో లేని వారికి తమ వద్ద ఉన్న సమాచారం మేరకు ఫోన్‌లో సంప్రదించి సర్వేకు రావల్సిందిగా చెబుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం : కొణతాలపల్లిలో డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే**

**చందంపేట :** మండలంలో అచ్చంపేట పట్టి గ్రామంలో డిజిటల్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వే శనివారం కూడా చేపట్టారు. అర్హుల నుంచి వివరాలు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులను డిజిటల్ కార్డుల ఎంపికకు గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, రాందాస్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సుమతమ్మ

**దేవరకొండ :** ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యడమ సుమతమ్మ కోరారు. శనివారం ఈ మేరకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష ఇస్తామని మంత్రి సీతక్క పలుమార్లు ప్రకటించినప్పటికీ ఇందుకు సంబంధించి జీఓ విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని ఆమె కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు.

## వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**దేవరకొండ :** వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవరకొండ, కంబాలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఎఫ్ఆర్‌ఓలు భాస్కర్, సుజావుద్దీన్ హష్మి అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవరకొండ పట్టణంలో అటవీశాఖ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అటవీ జంతువులకు ఎలాంటి హాని కలిగించొద్దని వారు తెలిపారు. అడవుల సంరక్షణకు గాను ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**నాగార్జునసాగర్ :** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ సెయింట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారు. గత నెల 29న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినయ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎండీ సభనూర్ హైజంప్ అండర్-17 విభాగంలో, జె శుష్మ విరాజ్ షాట్‌పుట్ అండర్-14 విభాగంలోనూ, లాంగ్ జంప్, రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7, 8 తేదీల్లో హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ సిస్టర్ లలిత, సిస్టర్ మతీనా, సిస్టర్ క్లారా, సిస్టర్ ప్రియా, పీఈటీ జె.కిరణ్‌కుమార్‌లు అభినందించారు.

## ఎల్2 కాలువకు గండి

**త్రిపురారం :** బెజ్జికల్ నుంచి చెన్నాయిపాలెం వెళ్లే దారిలో ఉప్పలమ్మ తల్లి గుడి సమీపంలో ఎల్4 కాలువ పరిధిలోని ఎల్2 కాలువకు భారీ గండి పడింది. దీంతో సాగు నీరు వృథాగా పోతుంది. అయితే ఇక్కడ కాలువకు గండి పడడంతో మండలంలోని చెన్నాయిపాలెం, అల్వాలపాడు, లావుడి తండాల పరిధిలోని రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు ఈనిక దశలో ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నెస్పీ అధికారులు తక్షణమే గుర్తించి గండి పడిన చోట మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఎల్2 కాలువకు పడిన గండి

## అన్నపూర్ణాదేవిగా దుర్గామాత దర్శనం

**మిర్యాలగూడ :** ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దేవరకొండ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు దేవరకొండలో కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఆయా దుర్గామాత మండపాల వద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శనివారం అమ్మవారు రాజేశ్వరీ మాత, మంగళగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం 108మంది మహిళలు పసుపు కొమ్ముల పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు చిన్నారులు నిర్వహించిన భరతనాట్యం ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

**డిండి:** మండల పరిధిలోని పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం శనివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, కుంభాభిషేకం, గోపూజ, నీరాజన మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, సర్సింహా, బాలు, శంకర్, భద్య, గోపాల్, నాను, చందు, హన్మ, సేవ్య, లస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లి :** మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం మూడోరోజు అన్నపూర్ణాదేవిగా భక్తులకు కేంద్రంలోని రాజరాజేశ్వర దేవాలయంలో వివిధ కూరగాయలు, పండ్లతో అమ్మవారిని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాలు భక్తులతో దర్శనమిచ్చాయి.



మిర్యాలగూడ : అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : ఇందిరమ్మ కాలనీలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



త్రిపురారం : పెద్దదేవులపల్లిలో 101 దీపాలతో దుర్గామాతకు పూజలు చేస్తున్న మాలధారులు

**ఇందిరమ్మ కాలనీలో అన్నదానం**

**మిర్యాలగూడ టౌన్ :** పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో శనివారం కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగునాయక్‌లతో పాటు పలువురు యువకులు తదితరులున్నారు.

**పెద్దదేవులపల్లిలో దీపోత్సవం**

**త్రిపురారం :** నిడమనూరు, త్రిపురారం మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం దుర్గామాతను అన్నపూర్ణ దేవీగా అలంకరించి పూజలు చేశారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో శివాలయం వద్ద దుర్గామాత మండపం వద్ద భవానీ మాలధారులు దీపోత్సవం నిర్వహించారు. 101 దీపాలు వెలగించి దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారి

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్ పద్మ

**వేములపల్లి (మాడుగులపల్లి) :** పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మాడుగులపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ పద్మతో కలిసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల సతీష్, మునగాల రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బట్టు మాధవరెడ్డి, మంచికంటి నాగిరెడ్డి, కల్లూరి వెంకట్‌రెడ్డి, పుట్ట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

**పెద్దఅడిశర్లపల్లి :** టీఎస్ ఎమ్మార్పీఎస్ గుడిపల్లి మండల అధ్యక్షుడిగా ఎర్ర శ్రీనివాస్‌ను దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొట్ట మురళి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఏలేటి నర్సింహా, రమణంపల్లి వెంకటయ్య, సైదులు, ఉదయ్, రవి, అచ్చుత్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**నల్లగొండ రూరల్ :** ప్రభుత్వం దసరా లోపు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ తెలంగాణ అఫ్లియేటెట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.సైదారావు, నర్సింహారెడ్డి, జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి శనివారం మహాత్మగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎ.రవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేసిందని, తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. గత మూడేళ్లుగా రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బోధనా సిబ్బంది జీతాలు, భవనాల అద్దెలు, కరెంట్ బిల్లు, భవన పనుల చెల్లింపు ఇబ్బందిగా మారిందన్నారు. అప్పులు తీసుకొచ్చి కళాశాల నిర్వహణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే దసరా తర్వాత కళాశాలలను నిరవధికంగా బంద్ చేయడానికి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయించిందని రిజిస్ట్రార్‌కు తెలిపారు.

## పవర్‌లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి

**నల్లగొండ టౌన్ :** పెరుగుతున్న ధరల కనుగుణంగా పవర్‌లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య కోరారు. ఈనెల 20తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు శనివారం పద్మానగర్‌లోని పవర్‌లూమ్ యజమానుల సంఘం అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గంజి నాగరాజు, పెండెం బుచ్చిరాములు, వెంకటేశం, భద్రయ్య, గిరిబాబు, సైదులు, పాల్గొన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి



మిర్యాలగూడ : వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ :** కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా పట్టణంలోని వై జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాక జీవితమంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. జీవితం ఎంతోమంది నాయకులకు ఆయనఆదర్శమన్నారు.

**మిర్యాలగూడ టౌన్ :** దివంగత కేంద్ర మంత్రి కాక వెంకటస్వామి 95వ జయంతిని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ పూలమాల వేసి నివాళులర్పించారు.ల ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకరమణతో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వెంకటస్వామికి నివాళి**

**చందంపేట :** చందంపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గడ్డం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నజీర్, అనిల్, రాజు, లోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్



చందంపేట : వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్, సిబ్బంది